క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

సత్తుపల్లిటౌన్: పరిశ్రమలు, షాపింగ్‌మాల్స్‌లో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ రమేష్, ఫైర్‌మెన్‌లు వీరబాబు, అనిల్‌కుమార్, మోషే పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్ రోడ్డును పరిశీలించిన డీఈ

వైరా: వైరా రిజర్వాయర్ పర్యాటక ప్రాంతానికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ డీఈ నరేష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు రోడ్డు నిర్మాణం ఎందుకు చేయడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎటువంటి రాజీ పడవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు.

అందుబాటులో బీపీటీ వరి విత్తనాలు

కారేపల్లి: కారేపల్లి సొసైటీలో రైతులకు బీపీటీ – 5204 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25కేజీల బ్యాగ్ ధర రూ.1,075లు, కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో కారేపల్లి సంత సమీపంలో ఉన్న పాతసొసైటీ కార్యాలయంలో కొనుగోలు చేసుకోగలరని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 91772 36912 సంప్రదించాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 16మంది ఎంపిక

సత్తుపల్లిరూరల్: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను చాటుకునేందుకు క్యాంపస్ సెలక్షన్ ఎంతగానో ఉపయోగపడతాయని ఆంధ్రి ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి సతీష్ జయరామన్ అన్నారు. గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలీయర్ విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్ ఆంధ్రి ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 152 మంది విద్యార్థులు హాజరు కాగా రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా 16 మందిని ఎంపిక చేశారు. వీరిని ఏడాదికి రూ.3లక్షలు చొప్పున వేతనం, ఇతర అలవెన్సులు ఉంటాయని ప్లేస్‌మెంట్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి, కంపెనీ ప్రతినిధి సతీష్, జయరామన్, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతులు యాకూబ్ అభినందించారు.

ప్రతీ పని ప్రార్థనతో ప్రారంభించండి

వైరా: ప్రతీ పనికి ముందు ప్రార్థనతో ప్రారంభిస్తే పని సక్రమంగా నెరవేరుతుందని హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ జోజి అన్నారు. శుక్రవారం స్థానిక మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ హెచ్‌ఎం సిస్టర్ యమున, సిస్టర్ ప్రదీప, సిస్టర్ బెనెట్, సుమ, జసింత తదితరులు పాల్గొన్నారు.

ఊరు మారె.. 'ఉపాధి' చేజారె !

కల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటుతో ఉపాధి పనులకు మంగళం

- 5,082 జాబ్‌కార్డులు రద్దు..
- కోల్పోయిన 46,652 పనిదినాలు
- రూ. 1.50 కోట్లు నష్టపోనున్న పేదలు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)



కల్లూరు మున్సిపల్ కార్యాలయం

కల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటు వల్ల 8గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు నిర్వహించిన ఉపాధిహామీ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో 5,082 మంది జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పని కరువైంది. మున్సిపాలిటీ ఏర్పాటుతో అభివృద్ధి జరగటం ఏమో కానీ.. ఉన్న పని రద్దు కావడంతో పేద ప్రజలకు ఉపాధి లేకుండా పోయింది.

కల్లూరురూరల్: కల్లూరు మున్సిపాలిటీలో కప్పలబంధం, వాచ్యానాయక్‌తండా, పుల్లయ్యబంజరు, తూర్పులోకవరం, పడమర లోకవరం, కిష్టయ్యబంజరు, హనుమతండా గ్రామ పంచాయతీలను కల్లూరు మున్సిపాలిటీలో కలుపుతూ యాక్ట్ నంబర్ 17 ద్వారా ఏప్రిల్ 15, 2025న రాష్ట్ర గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఏప్రిల్ 16వ తేదీ నుంచి కల్లూరు మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఆ రోజు నుంచి ఉపాధిహామీ పథకం పనులను అధికారులు నిలిపివేశారు.

5,082 జాబ్‌కార్డులు రద్దు..

హనుమతాండ గ్రామ పంచాయతీలో 332 జాబ్ కార్డులు, కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీలో 2,797, కప్పలబంధంలో 714, కిష్టయ్యబంజరులో 134, తూర్పులోకవరంలో 187, పడమర లోకవరంలో 282, పుల్లయ్యబంజరులో 388, వాచ్యానాయక్‌తండాలో 248 జాబ్‌కార్డులు రద్దు అయ్యాయి. ఆయా గ్రామాల పేదలు ఎక్కువగా ఉపాధిపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇప్పుడు మున్సిపాలిటీ ఏర్పాటుతో తమ ఉపాధి పోయిందని కూలీలు గగ్గోలు పెడుతున్నారు.

పని దినాలు కోల్పోయిన పేదలు..

మున్సిపాలిటీలో విలీనమైన కూలీలు సంవత్సరానికి 46,652 పని దినాలు కోల్పోయారు. హనుమాతాండలో 4,951, కల్లూరు మేజర్ గ్రామపంచాయతీలో 10,088, కప్పలబంధంలో 5,124, కిష్టయ్యబంజరులో 3,374, తూర్పులోకవరంలో 2314, పడమర లోకవరంలో 3755, పుల్లయ్య బంజరులో 7601, వాచ్యానాయక్ తండాలో 9,447 పని దినాలు రద్దు అయ్యాయి. దీనివల్ల కల్లూరు మున్సిపాల్టీ పరిధిలోని ఎనిమిది గ్రామ పంచాయతీలలో 1.50 కోట్ల రూపాయల ఉపాధిహామీ పనులకు మంగళం పాడినట్లయింది.

ఆత్మీయ భరోసాకు నోచుకోని భూమిలేని కూలీలు..

జాబు కార్డు కలిగి ఉపాధిహామీ పథకం చేస్తున్న భూమిలేని నిరుపేద కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకం కింది సంవత్సరానికి రూ.12వేలు కూలీల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ప్రకటించారు. కానీ కల్లూరులో విలీనమైన పలువురు కూలీలకు ఆత్మీయ భరోసా పథకం పొందేందుకు అవకాశం లేకుండా పోయింది.

ప్రత్యామ్నాయం చూపించాలి..



పుల్లయ్యబంజరు గ్రామ పంచాయతీని కల్లూరు మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల మేము ఉపాధి కోల్పోయాం. వ్యవసాయ కూలీ పనులు లేని సమయంలో ఉపాధిహామీ పథకం ద్వారా జీవనం కొనసాగించాము. ఉపాధి కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి పనులు చూపించాలి.

– కిష్టంశెట్టి కృష్ణారావు, ఉపాధిహామీ కూలీ, పుల్లయ్యబంజరు

పట్టణాల్లోనూ ఉపాధి ఉండాలి..



గ్రామాల మాదిరిగానే పట్టణాల్లోనూ ఉపాధిహామీ పథకం ఉండాలి. వాస్తవానికి మా ఊళ్లో సగం మందికి పైగా ఉపాధి పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాం. మున్సిపాలిటీలో విలీనం చేసినంత మాత్రాన ఉపాధిహామీ పనులు రద్దు చేయడం అన్యాయం. వెంటనే మాకు ఉపాధి పనులు ప్రారంభించాలి.

– నందిగామ మరియమ్మ, కప్పలబంధం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



సత్తుపల్లి: కాకర్లపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లి: ప్రతి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్ అన్నారు. మండల పరిధిలోని కాకర్లపల్లిలోని బోడు కాలనీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఏఎన్‌ఎం మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులవంచగ్రామంలో..

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 54మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది గృహ సందర్శన చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లె దావఖాన వైద్యుడు వేణుమాధవ్, సూపర్‌వైజర్లు జ్యోతిరత్న, కృష్ణారావు, సుజాత, నర్సమ్మ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తల్లాడ: తల్లాడ పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం యోగా శిక్షణ నిపుణులు శ్రీదేవి యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి నీలిమ, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, కమల, ఝాన్సీ, లక్ష్మీ, భద్రమ్మ, శ్రీదేవి, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



యోగాసనాలు నేర్పిస్తున్న యోగా నిపుణురాలు శ్రీదేవి

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు..



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాధ

కల్లూరురూరల్: దేశంలో ప్రధాన సమస్యగా మారిన మాదకద్రవ్యాల జోలికి యువత వెళ్లొద్దని మెదక్ ఎక్సైజ్ సీఐ మేచర్ల రాధా స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని పేరువంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై నిర్వహించి అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. స్నేహితులతో కలిసి సరదాగా మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దన్నారు. అదే విధంగా స్వర్గీయ మేజర్ల సుజాత జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందించి, సొంత ఖర్చులతో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మేచర్ల రాధను, తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, మరియమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురదృస్‌రావు, ఉపాధ్యాయులు మౌలాలీ, సర్వేశ్వరరావు, జ్యోతి, సురేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు వీరమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

మధిర: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు 100 స్కూల్ బ్యాగులు, వెయ్యి నోటు పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. ఆశాజ్యోతి ఫౌండేషన్ సభ్యుడు కోన లక్ష్మి మోహన్‌రావు విద్యార్థులకు చేయూత అందించడం అభినందనీయమని తెలిపారు. నాగేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, మాణిక్యమ్మ, వెంకయ్య బాబు, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

మర్లపాడులో..

మర్లపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సుంకర షర్మిల, శీలం వెంకటరెడ్డి సహకారంతో సాక్స్, టైలు, బెల్టులు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూసిరెడ్డి శిరీష, ఉపాధ్యాయిని సాహిదా బేగం పాల్గొన్నారు.

కౌలు రైతులను విస్మరించొద్దు..

బోనకల్: ప్రభుత్వం కౌలు రైతులను విస్మరించవద్దని కౌలు రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో నిర్వహించిన రైతుసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందడం లేదని, అధికార గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు యంగల ఆనందరావు, ఆకెన పవన్, చింతలచెర్వు మదారయ్య, పుచ్చకాయల తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకేనా ఇందిరమ్మ ఇళ్లు?



లక్ష్మి గుడిసె వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

వైరా: నిరుపేదలకు కాకుండా కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని పలువురు మహిళలు ఆరోపించారు. వైరా మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన తమ్మిశెట్టి లక్ష్మి గత 25ఏళ్లుగా గుడిసెలో నివసిస్తోంది. ఇటీవల ప్రజాపాలన సభలో ఆమె ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా జాబితాలో పేరు చేర్చారు. కానీ వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన సమయంలో ఆమె పేరు లేదు. దీంతో కాంగ్రెస్ నాయకులే తనకు మంజూరైన ఇంటిని రద్దు చేయించారని, వారి అనుచరులకు ఇప్పించుకున్నారని ఆమె వాపోయింది. మూడేళ్ల క్రితం తన భర్త అనారోగ్యంతో మృతి చెందగా పింఛన్ కూడా మంజూరు కాలేదని కన్నీరుమున్నీరైంది. ఈమేరకు లక్ష్మి గుడిసె వద్ద శుక్రవారం నిరసన తెలిపిన మహిళలు.. ఎమ్మెల్యే స్పందించి ఆమెకు ఇల్లు ఇప్పించాలని కోరారు.

ఖర్గే సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నిర్వహిస్తున్న సామాజిక న్యాయ సమరభేరి సభకు పలు మండలాల్లోని కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం భారీగా తరలి వెళ్లారు. బస్సులు, కార్లు, ఇతర వాహనాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరిన వాహనాలను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు జెండా ఊపి ప్రారంభించారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, తదితరులు

క్రైం కార్నర్

వివాహిత అదృశ్యం

బోనకల్: మండలంలోని చిరునోములకు చెందిన వివాహిత పిల్లెం హర్షిత కానరాకుండా పోయింది. ఆమె తన ఆరు నెలల కుమారుడు సూర్యతేజ్‌కు టీకా వేయించేందుకు బుధవారం అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లింది. ఆతర్వాత తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకన్న తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బోనకల్: మండలంలోని మోటమర్రి రీచ్ నుండి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ వంగల వెంకటనారాయణపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

ఘర్షణలో ఎనిమిది మందిపై కేసు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లలో ఇళ్ల వద్ద దారి విషయమై శుక్రవారం ఇరువర్గాలు ఘర్షణకు దిగగా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకన్న తెలిపారు. ఘటనలో ఓ వర్గానికి చెందిన పండగ కృష్ణ, మరో వర్గానికి చెందిన షేక్ ఇమాంబీకి గాయాలయ్యాయి. పరస్పరం ఫిర్యాదు చేయడంతో షేక్ ముస్తఫా, షేక్ ఇమాంబీ, షేక్ రజియా, షేక్ కుతుబుద్దీన్, షేక్ రెహమాన్, పండగ కృష్ణ, పండగ అనిల్, కృష్ణమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యూరియా కొరత రానివ్వొద్దు..



మాట్లాడుతున్న మధుసూధన్‌రావు

పెనుబల్లి: రైతులకు యూరియా కొరత లేకుండా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూధన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో అధికార ప్రతినిధి మధుసూదన్ మాట్లాడారు. పెనుబల్లి మండలంలో సొసైటీ, గ్రోమోర్ ద్వారా 60శాతం యూరియా, ప్రైవేట్ డీలర్ల ద్వారా 40శాతం యూరియా సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ మండలంలోనే ఒకే ప్రవేట్ డీలర్‌కు 50 టన్నుల యూరియా ఇచ్చి, మిగిలిన డీలర్లకు సరఫరా చేయలేదన్నారు. దీంతో ఆ డీలర్ వద్దే రైతులు అధిక ధరకు యూరియా కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వ్యవసాయ అధికారుల దృష్టి సారించి ధరలు అదుపుచేసి, యూరియా కొరత లేకుండా చేడాలని రైతులు కోరారు. మండల ప్రధాన కార్యదర్శి గాయం నాగరాజు, కార్యదర్శి కోటా సుధాకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు చెక్కిలాల మంగీశ్వరరావు, కాటిని శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

కొణిజర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (సీపీఐ అనుబంధ) రాష్ట్ర అధ్యక్షుడు కొలికొండ కాంతయ్య అన్నారు. శుక్రవారం కొణిజర్లలో పగిడిపల్లి ఏసు అధ్యక్షతన నిర్వహించిన సంఘం 26వ జిల్లా మహాసభలో ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసు, వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'విజయ'లో ఏఐ మాస్టర్ కోర్సు ప్రారంభం

కొణిజర్ల: విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీని అందించాలనే లక్ష్యంతో కొణిజర్ల మండలం అమ్మపాలెంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఏఐ అండ్ జెన్ ఏఐ మాస్టర్ కోర్సును ప్రారంభించారు. సీడ్స్ లాబ్స్ హైదరాబాద్, మైస్పార్క్ అకాడమీ వారి సహకారంతో శ్రీకవిత విద్యాసంస్థల డైరెక్టర్ కవిత ఎర్రా, వైస్ చైర్మన్ విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. మొదటి బ్యాచ్‌గా సూపర్ 30ను శుక్రవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తరుణమ్, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్ బాబా, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు పకీరమ్మ, మండల కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా కమిటీ పెనుబల్లి ప్రభుత్వాసుపత్రిని సందర్శించి ఆస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీకేఎంయూ జిల్లా కమిటీ సభ్యుడిగా నాగరాజు

సత్తుపల్లిరూరల్: వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా మహాసభలో సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన నకరికంటి నాగరాజును జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

వైరా/కల్లూరు/తల్లాడ: ఈ నెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు సీవై పుల్లయ్య, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా నాయకుడు కె.పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం వైరాలోని విక్రమ్ భవన్‌లో, కల్లూరులో, తల్లాడలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాబు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సైదులు, హమాలీ సంఘం నాయకులు టీయూసీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లాల్‌మియా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



కేక్‌కట్ చేస్తున్న కాపు సంఘం నాయకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యాన వంగవీటి రంగా జయంతి వేడుకలను పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు పీఎల్ ప్రసాద్, మాధురి మధు, సుంకర వాసు, పురుషోత్తం, కృష్ణ, సురేష్, మోహన్‌రావు, నరేష్, నాగు, మురహరి పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య జీవితం స్ఫూర్తిదాయకం

వైరా: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య అని, ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీలోని గండగలపాడు గ్రామంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొమరయ్య 79వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయకార్మిక సంఘం పట్టణ కార్యదర్శి నరసింహారావు, రవి, రాంబాబు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు

వైరా/సత్తుపల్లిరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను వైరా వర్తక సంఘం ఆధ్వర్యంలో, గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎస్.పెదబాబు, వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైరాలో ముగ్గురు నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో అదనపు దళాధిపతి అంజయ్య, సహాయ దళాధిపతి రంగారెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, డాక్టర్ భూమాత పెరుమాళ్ల కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్ సహకారం అభినందనీయం

తల్లాడ: ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నప్పటి నుంచి మౌలిక సదుపాయాల కల్పనకు దుగ్గిదేవర రఘునందన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని తల్లాడ ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, గ్రామ మాజీ సర్పంచ్ దుగ్గిదేవర నర్సయ్య వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని మల్లవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం హరిబాబు, అనీల్‌కుమార్, సైదులు, వీరభద్రరావు యూత్ క్లబ్ అధ్యక్షులు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, నరేష్, శివ పాల్గొన్నారు.

వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీ

బోనకల్: మండల కేంద్రంలోని మానవవనరుల కేంద్రంలో మంగళవారం, శుక్రవారం వారాల్లో ఫిజియోథెరపీ సేవలు నిర్వహించనున్నట్లు ఫిజియోథెరపిస్ట్ అమృతవర్షిణి తెలిపారు. కార్యక్రమంలో ఐఈ ఆర్‌టీ పుల్లారాణి, మండల విద్యాశాఖాధికారి పుల్ల య్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతన్న కలత

- అందుబాటులో ఉంచాలని రైతుల విజ్ఞప్తి
- నియోజకవర్గానికి 1,282 టన్నులు అవసరం
- ప్రస్తుత నిల్వ 638 టన్నులు మాత్రమే
- ఆందోళనలో అన్నదాతలు



బోనకల్‌లో సాగుచేస్తున్న పత్తి పంట

చింతకాని: వానాకాలం పంటల సాగును ప్రారంభించిన రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల కొరత తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. పంటలకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సకాలంలో ఎరువులు వేయకపోవటంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోయారు.

70వేల ఎకరాల్లో సాగు..

మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని రైతులు 70వేల ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. గతేడాది అధిక వర్షాలతో వానాకాలంలో సాగుచేసిన పత్తి పంట దెబ్బతిని దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుత వానాకాలంలో సాగుచేస్తున్న పత్తి పంటపై దిగుబడి ప్రభావం చూపకుండా సకాలంలో ఎరువులను అందిస్తే పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు తెలిపారు.

1,282 మెట్రిక్ టన్నులు అవసరం..

నియోజకవర్గ వ్యాప్తంగా వానాకాలంలో సాగుచేసే పంటలకు జూలై నెలలో 1,282 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. కానీ ప్రస్తుతం 638 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే రైతులకు అందుబాటులో ఉంది. యూరియా, డీఏపీ వంటి ఎరువులను ప్రైవేట్ ఎరువుల డీలర్లు విక్రయాలను ప్రస్తుతం నిలిపివేయటంతో కేవలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా, డీఏపీ వంటి ఎరువులను రైతులకు అందించాల్సి ఉంది.

పెరిగిన ఎరువుల వినియోగం..

గత ఏడాదితో పోల్చుకుంటే యూరియా, డీఏపీ ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది. ఎరువులపై సబ్సిడీ ఎత్తివేయడంతో యూరియా ధరకు, మిగతా ఎరువుల ధరలకు మధ్య వ్యత్యాసం భారీగా పెరిగింది. పెరిగిన ధరలతో కాంప్లెక్స్ ఎరువులు కొనలేక, పైరుకు ఏదో ఒక ఎరువు వేయాలన్న ధోరణితో రైతులు యూరియా వైపు మొగ్గుచూపుతున్నారు.

సరిపడా అందించాలి..



అధికారులు యూరియా కొరతను నివారించాలి. పంటలకు సకాలంలో ఎరువులను అందించలేకపోతే పంటల దిగుబడి తగ్గుతుంది. అదును తప్పిన తర్వాత ఎరువులను వేసినా ఆర్థికంగా నష్టం తప్ప ప్రయోజనం ఉండదు. పంటలకు అవసరమైన సమయంలో యూరియాను అందించాలి.

– ఎరుకలబోయిన శ్రీనివాసరావు, రైతు, మత్కేపల్లి

చర్యలు తీసుకోవాలి..



ప్రైవేట్ ఎరువుల డీలర్ల వద్ద యూరియా, డీఏపీ వంటి ఎరువులు లేవు. సొసైటీల ద్వారా అందించే ఎరువులను రైతులందరికీ అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం సాగుచేసిన పత్తి పంటతో పాటు సాగు చేపట్టనున్న వరి పంటకు అవసరమైన యూరియాను అందించాలి.

– సైదులు, రైతు, గంధసిరి

కొరత లేకుండా చూస్తాం..



వానాకాలం సీజన్‌లో సాగుచేసే పంటలకు 1,282 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ప్రస్తుతం సొసైటీల్లో 638 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. రైతులకు ద్రవ రూపంలో ఉండే నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించడంతోపాటు యూరియా కొరత లేకుండా చూస్తాం.

– ఎస్.విజయ్ చంద్ర, మధిర ఏడీఏ